
# కంపార్టుమెంటొకటి



## రావి కొండలరావు

ఒకానొక మూడోతరగతి రైలుపెట్టె. పాత పత్రికలు ఇంటినిండా ఎక్కువయిపోతే, అలమారులో క్రుక్కేయగా, అలమారుసొంపు ఎంతతీరుగా వుంటుందో అంతకన్న అధ్వాన్నంగా వుంది ఆ పెట్టె. చెత్త వూడ్చని మునిసిపాలిటీరోడ్డూ, రైల్వే ప్లాట్‌ఫారం ప్రక్కనే వుండే "హెచ్చుతరగతి ప్రయాణీకులు కూర్చుండు గదీ" వర్షాకాలంలో హోటలు వాళ్ళ వంటగదీ,-వంటివి ఏవీకూడా ఈ రైలుపెట్టెతో సరితూగిలేవు!

అతి బరువుగా వున్న రైలుపెట్టె కాళ్ళీడ్చుకుంటూ "నడచి" నీరసంగా ఆగింది. అదో స్టేషను. అంతుకని పెట్టెలో త్రొక్కిడి అధికమయింది. అందులో ఎంత మంది కూర్చోవాలో రాసివుందిగాని - ఎంతమంది నించోవాలో రాసిలేదు. అందుకని, వీలున్నంతమంది - లేదా, వీల్లేనంతమంది, ఒంటికాళ్ళమీదా. బొటన వేళ్ళమీదా. కొందరు మోకాళ్ళమీదా మరికొందరు మో:చేతులమీదా నుంచున్నారు. కొందరు పెట్టెలమీద నించుంటే, మరికొందరు వాళ్ళమీదే నించున్నారు. ఇది ఇట్లావుండగా-సామాన్లు పెట్టుకోవలసిన పై 'అర'లమీద - వున్న రెండుకాళ్లూ నాలుగుగా భావించుకుని అరు మైళ్ళ పొడుగున నిటారుగా చాచుకొని పడుకున్న వాళ్లూ వున్నారు. వీళ్ళల్లో కొందరు గురకపెట్టి నిద్రపోతూ వుండగా మరికొందరు పత్రికా పఠనం ప్లస్ ధూమ పానం, ఇంకొకాయన అపరాధ పరిశోధక నవలా ప్లస్ పొడుగుపాటి చుట్ట పానంచేస్తు న్నారు. పెళ్ళిలో మండని గాడిపొయ్యినుంచి వచ్చే పొగలాగా బండినిండా పొగ. మూడు నాలుగు ఫాన్లున్నట్టున్నాయి. ఒకటి తిరుగుతూదానిచిత్తమొచ్చినరీతి ప్రవర్తిస్తున్నది. మరోటి హాయిగా ఆగి కూచుంది. పెద్దగా రొదచేస్తూ మిగిలినవి తిరుగుతున్నాయి. ఇందులో రెండు పైవారి భుక్తం. మిగిలిన ఒక్కటీ ప్రయాణీకుల సౌకర్యముకొరకు.

ఆపెట్టెలో ముసలివాళ్ళూ, పిన్నవాళ్ళూ, చిన్నపిల్లలూ, స్త్రీలూ, విద్యార్థులూ, వ్యాపారులూ, 'అక్కడే' వర్తకులూ, బిచ్చగాళ్ళూ ఉద్యోగులూ, నిరుద్యోగులూ వాళ్లూ వీళ్లూ అన్నిరకాలవాళ్లూ వున్నారు - ఒక దేశానికి మచ్చుతునకలాగా, ప్రతినిధిలాగా - నించున్నది ఆపెట్టె!

బండి ఆగీ ఆగగానే, ఆ స్టేషన్‌లో దిగవలసినవాళ్ళ ముందున్నవాళ్ళ భుజాలమీద నుంచి తలకాయమీదనుంచీ నడిచిపోతూ, ఆవెనకనే సామాన్లు బరబరాలాగేస్తూ దిగే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రయత్నానికి అభిముఖంగా అదేవిధంగాలోపలకు ఎక్కే ప్రయత్నమూ చేస్తున్నారు - అట్నుంచి కొందరు. వాళ్ళు యెక్కరు - వీళ్ళు దిగరు. వీళ్ళూ వాళ్ళూ మధ్యలో ఢీకొట్టుకుని-కొట్టుకొనే పర్యంతం అయింది. "దిగనీవయ్యా, ఎక్కుదువుగాని - దిగనీ" అని అరున్నర శ్రుతిలో కండువా సరిచేసుకొంటూ, మరోచేత్తో పెట్టి లాక్కుంటూ అరుస్తున్నాడు ఒక ఆసామీ.

"నువ్వుదిగేదేంది. వుండవయ్యా నన్నెక్కనీ. బండి బయల్దేరతంది" అని అవతలవాడు.

"నన్నొక్కత్తెని ఎక్కనీండి బాబూ, ఆడదాన్ని, బాబూ"

ఈ దిగేవాడు దిగకుండా "నువ్వు ఆడవాళ్ళ పెట్టెకు పో అమ్మా" అని సలహా యిస్తున్నాడు, ఉచితంగా శంగారుగా.

"అక్కడ చోటులేదు బాబూ"

"ఇక్కడుండి చచ్చిందింత!"

దిగేవాళ్ళు దిగడంలేదు. ఆ స్టేషన్‌లో బండి మూడు నిమిషాలకంటె ఎక్కువసేపు ఆగదు. తను ఎంత ఆలస్యంగా వచ్చినా, ఎంత నెమ్మదిగా నడిచినా తప్పులేదుగాని - స్టేషన్‌లో ఆగే వ్యవధి మాత్రం విధిగా పాటించి తీరాల్సిందే అంటుంది రైలు. ఇష్టంవస్తే ఈ రూలు సడలడానికి కూడా అభ్యంతరంలేదు, ఎక్కేవాళ్ళ సామాన్లు లోపలకు విసిరేస్తున్నారు, ఒకడు సామాన్లు ఎక్కించమని రైల్వే బోర్డుమీద కేకలు వేస్తున్నాడు. "మీరు ఎక్కండి బాబూ" అంటాడువాడు.

"నువ్వు సామాను ఎక్కించవయ్యా స్వామీ, నా ఎక్కడం ఎంతసేపు! తీరా నేనెక్కి నువ్వు సామాను పెట్టకపోతే ...తొయ్యకండి"

"బాబూ, నేనూ ఎక్కవలసిన వాడినే"

"బాబూగారూ, ఈ మూట అందుకోండి ఆడదాన్ని" అని కిందనుంచి ఆమె అరుస్తున్నది.

బర్తుమీదవున్న చుట్ట తాగుడాయన సావకాశంగాతలతిప్పి - "ఇదే స్టేషనండీ." అని గొణుక్కున్నాడు.

"రైల్వేస్టేషను" అని ఒక యువకుడు జోకు విసిరాడు, వళ్ళుమండి "ఏవూరండీ ఇదీ?" అనిఅతనే ఎక్కుదామనుకొంటున్న

వాళ్ళను మూడు నాలుగుసార్లు అ డి గి, కోపంవచ్చి ఘాటుగా దమ్ములాగి బుస్సైడు పొగవదిలాడు!

"ఈస్టేషన్‌లో కాఫీ దొరికేట్టులేదు" ఇంతే ఈ రైలు వాళ్ళు" అని ఒ క డు కోప్పడ్డాడు నెమ్మదిగానే లేచికూచుని.

దిగేవాడొకడు, కోపంవచ్చి పెట్టె బర్రుమని లాగాడు. అక్కడే సగంకూచున్న చిన్నపిల్ల "అమ్మో - నా కాలు నా కాలు" అని ఏడుపు లంకించుకుంది.

"నీకేంకళ్ళు లేవటయ్యా-పిల్లలుంటేనూ" అని ఆపిల్లతండ్రీ, మరుగుదొడ్డి తలుపుతీసుకుని గుమ్మంమీద కూచుని చిన్నపిల్లకు పాలు యిస్తున్న ఆపిల్లతల్లీ యిద్దరూ కేకలు వేశారు. దిగేవాడికి ఇదేమీ లెఖ్ఖలేదు. కొంత సామాను దింపాక, "ఏమండోయ్, ఆసీటు కింద బుట్ట ఒకటి వుంటుంది. ఇట్లా అందుకోండి" అన్నాడు. ఎవరూ అందుకోలేదు. "అందుకోండి ?....బండెళ్ళిపోతాది" ఇహ లాభంలేదని దిగేవాడే చే తు లూ కా ళ్ళూ తలలూ తొక్కుకుంటూ, సీట్లమీద ఎక్కి ఆ మూలకు దిగి కిందకు వంగి బుట్ట బయటకు లాగాడు

"అదేంబుట్ట బాబూ, పళ్ళా ఏమిటి?.... కొన్నారు ?" అని భోగట్టా చేయసాగాడు పైన కూచున్న కాఫీ గతప్రాణి. పెట్టెగుమ్మం దగ్గర రద్దీ అట్లాగేవుంది. ఒకడో ఇద్దరో దిగినట్టున్నారు తప్ప - ఎక్కినవాళ్ళులేరు. "ఇది రిజర్వ్ - ఇది రిజర్వ్" అని లోపలున్నవాడు ఒకడంటున్నాడు గడుసుతనం నాకే వుందన్నట్టుగా.

"రిజర్వయితే నువ్వెందుకెక్కినా ?" అని ఎక్కుదామను కుంటున్న ఒక ముసలాయన చిరాగ్గా అడిగాడు.

"నన్నెక్కనీండి బాబూ, నన్ను ముందు ఎక్కనీండి" అనిఒకడు దర్జాగా సీరియస్‌గా హక్కున్న వాడిలాగా ఎక్కబోయాడు. వాడెవడోకాదు - చేతికి బుట్ట తగుల్చుకొని బటానీలు అమ్మే వ్యాపారి, వాడినికూడా ఎ వ రూ ఎ క్క ని వ్వ లే దు. ఎక్కనివ్వాలని గసిరాడువాడు- "ఇక్కడెవరికీ అఖ్ఖర్లేదు పోవయ్యా" అని పిల్లతండ్రి విసుగ్గా అరిచాడు. "ఎవరికీ అని చెప్పటానికి మీకేం హక్కుందండీ - మాకుకావాలి - ఓ అణావిప్పుచ్చుకోండి" అని పైనున్న కాఫీ ఆ య న పిల్లతండ్రికి అణా అంది వ్వబోయాడు, పిల్లతండ్రి వినిపించుకోలేదు. బటానీలవాడు జబర్దస్తీ చేయబోయి ఎక్కబోయాడు - ఆ సమయానికీ దిగే బాపతు యువకరత్నం ముందు హోల్డాలు తోశాడు. అది వెళ్ళి బటానీల బుట్టకు కొట్టుకుంది - బుట్ట వూడి రాలేదుగాని - బటానీలన్నీ ప్లాట్‌ఫారం పాలయినాయి. ప్లాట్‌ఫారం మీద ఆ డు కు ్క ం టు న్న వా ళ్ళు కొందరు హడావిడిగా పరుగెత్తుకొచ్చి కింద పడిన బటానీలమీదబడి - చేతికందినవి లాక్కుని నోట్లో పోసుకోసాగారు. బటానీలవాడు తారస్థాయిలోతిట్లకులంకించుకున్నాడు. యువకరత్నం నలుగుర్ని తోసుకుంటూ బరిలోకి దూకినట్టు కిందకి దూకాడు -

"పోయిన బటానీలు పోతేపోయాయిగాని నువ్వు లోపలకురావయ్యా" అని బటానీలవాడికి పైనున్న కాఫీ మనిషి ఆహ్వానపత్రంపంపాడు. పెట్టెలోకొందరు'అబ్బబ్బ అంటున్నారు - మరికొందరు "ఇష్షూ" ఇంకొందరు "రా మ రా మ" అని అనుకుంటున్నారు.



ఒక అసామీ ఎట్లాగో ఎక్కి ఫుట్‌బోర్డు మీద నించున్నాడు- "లోపలకు రానీయండి" అంటూ.

"అక్కడ నించోవయ్యా - చోటులేంది ఎ క్క డి కి రానీయమంటావు ?" అని లోపల్నుంచి ఎవరో కేకలు వేశారు.

"ఆ, కాఫీ యేయ్‌కాఫీ - వేడికాఫీ" - అని ప్లాట్‌ఫారంమీద నించుని కిటికీలోంచి చూస్తూ బండిలోకి అరిచాడు - కాఫీ కుర్రాడు.

"ఏది నాయనా, ఓగ్లాసు" అన్నది కాఫీ గతప్రాణి అక్కడనుంచే చెయ్యిజాస్తూ.

"బాబూ, ఇది వా రి కి వ్వ ం డి" అని అందించాడు వాడు దగ్గరున్నవాడికి.

"ఇదో గోల -"

"ఇటివ్వండి బాబూ"

అంచెలమీద ఆ కాఫీగ్లాసు పైనున్న వ్యక్తికి చేరింది. ఆయనగారు ఓ పిల్పుపిల్చి "రూపాయి చిల్లరుందా ?" అని అడిగాడు.

"ఆ, నోటివ్వండి".

కాఫీ గ్లాసు లాగే ఆనోటుకూడా అంచెల మీద అతనిదగ్గర కొచ్చింది.

అతను చిల్లర లెఖ్ఖపెట్టే కార్యక్రమంలో వున్నాడు, గార్డువేసిన ఈల కాంయ్‌మన్నది.

"చిల్లర యివ్వనాయనా, ఇదిగో గ్లాసు-" అంచెలమీద ఆ ఎంగిలిగ్లాసు అతన్ని చేరుకున్నది.

"నాన్నా నాకూ కాఫీ నాన్నా" అని ఓ పిల్ల ప్రయాణీకుడు ముద్దుగనిశాడు. ఆ తర్వాత వాడి వీపుమీద ఢా మ్మ ని చప్పుడయింది - పిల్ల ప్రయాణీకుడు మళ్ళా కాఫీమాట యెత్తలేదు.

దిగవలసిన వాళ్ళు దిగినట్టున్నారుగాని-ఎక్కవలసినవాళ్ళు మాత్రం పూర్తిగా ఎక్కినట్టులేరు.

"బాబూ, ఆడదాన్ని బాబూ....నన్ను ఎక్కనీండి" అని ఆమె అట్లాగే అరుస్తున్నది. - ఫుట్‌బోర్డుమీద ప్రయాణం చేయాల్సినవాడు - "లోపలకు రానీయండి" అంటున్నాడు. గార్డు రెండోసారి ఈల వేశాడు - ఆ ఈల అందుకొని, రైలుఇంజను గొంతుపోయిన నటుడు పద్యానికి రాగం తీసిన పద్ధతిలో అరిచింది. ఇంతలో టిక్కట్లు పరీక్షించే రైల్వేఅధికారి అక్కడికొచ్చాడు - ఎక్కే ప్రయత్నం చేస్తూ. "అసలే చోటులేదు. మీరు మరో పెట్టె చూసుకోండిసార్" అన్నాడు జోకుల యువకుడు. రైల్వే అధికారి వ్యర్థ ప్రయత్నంచేసి - హాయిగా వుంటుందని అనుకొని ఒకటో తరగతి పెట్టెకు వెళ్ళిపోయాడు.

ఈలవేసిన రైలు, వెంటనే కదలలేదు; కారణం యెవరికీ తెలీదు. జనం యింకా వస్తూనే వున్నారు. గుమ్మంముందు గుమిగూడుతూనే వున్నారు. ఇంతలో అక్కడికి ఒకాయన పరుగెత్తుకొచ్చి - "రండి, రండి అక్కడ చోటుంది - రండి రండి...."అని పరుగెత్తసాగాడు.

"ఎక్కడ బాబూ ఎక్కడ?" అని ఎక్కబోయే గుంపూ, సగం యెక్కిన గుంపూ ఆత్రుతగా అడిగింది.

"రండి రండి, ఇంజన్ లో యిద్దరే వున్నారు...."అని అతను పరుగెత్తాడు. అతని మాట వినిపించుకోనివాళ్ళు అతని వెనకే పరుగెత్తారు. కొందరు "పిచ్చివాడు" అనుకున్నారు.

ఇంజను మళ్ళీ కూసింది.

కాఫీ తాగినాయన-"చిల్లర ఇవ్వయ్యా" అని అరిచాడు, కాఫీవాడు యింకా లెఖ పెడుతూనే వున్నాడు. అతికష్టంమీద రైలు - బరువుగా కదిలింది. "చిల్లరేదయ్యా?" కాఫీవాడిలెఖ పూర్తికాలేదు. బండి వాడిని దాటిపోయింది.

"ఆ చిల్లర అందుకోండి, బాబూ, చిల్లర....చిల్లర....చిల్లర...." అంటున్నాడు కాఫీ గతప్రాణి. ఎవరూ ఆ ప్రయత్నం చేసినట్టులేరు. ఒకాయన కిటికీలోంచి తొంగి చూశాడు - కాఫీవాడు కనిపించనేలేదు!

"దొంగముండావాడు, ఎంత పనిచేశాడో, చూశారా - కాఫీ అని నీళ్ళు అందించాడు- రూపాయీ పట్టుకుపోయాడు, గ్లాసయినా వుంచుకున్నానుగాదు" అని పెద్దగా స్వగతం ప్రారంభించాడు - కాఫీ తాగినాయన. చుట్టతాగుడాయన శరీరం బరువుగా, ఆ రైలులాగే, కదిలి - "ఏమిటండీ ఏం జరిగిందీ?"అన్నది నిదానంగా - అప్పుడే లోకంలోపడి.కాఫీమనిషి ఈమాటవినిపించుకోనేకాదు, భావావేశాలు ప్రకటిస్తూ స్వగతం దంచేస్తున్నాడు!

బండి ప్లాట్‌ఫారం దాటింది. ఈ జనంలోనే కలిసిపోయి ఎక్కడో పాతుకుపోయిన రైల్వేగాయకుడు నిటారుగా లేచినించుని-చేతిలోని చిడతలు రెండు మూడుసార్లు టకటకలాడించి మరోమూడుసార్లు "కర్ర్ కర్ర్" మని చప్పుడుచేసి, ఎడంచేయి చెవిమీద పెట్టుకొని, ఏకహస్తంతోనే లయవేసేస్తూ-

"మిద్దె బంతిపూవులో - మూగె కళ్ళ పూసిలో" అని తన ధోరణిలో పాట ప్రారంభించాడు. పక్కనున్నవాడు వూరుకోమన్నాడు. కాని, గాయకుడు లక్ష్యపెట్టలేదు.

జుట్టు రేపుకుని, ఘోరయుద్ధం చేసి పెట్టిలో అడుగుపెట్టిన కొత్త ప్రయాణీకుడు "లోపలకు రానివ్వండి" అన్నాడు ముక్తసరిగా.

"మానెత్తి ఎక్కవయ్యా, చస్తూంటే లోపలకు రానీయమంటావు"

"రానివ్వాలండీతప్పుకోండిఅని"రాబోయే కొత్తప్రయాణీకునిపాదాన్ని తన పాదరక్షతో తీవ్రంగా పలకరించాడు.

"ఓరీ నీ బూడ్సుకాలు తగలడా. తియ్యరా...." అన్నాడుఅతను కంయ్‌మని.

"రా ఏమిటయ్యా, పళ్ళురాలగొడతాను" అన్నాడు కొత్తాయన.

"ఏంటి రాలగొడతావు - కాలుతొక్కి-"

"పోనీ వూరుకోండి బాబూ" అని ఓ గొంతు.

"ఏంటయ్యారాలగొట్టేది, కాలుతొక్కి-"

"మరి జరగరాదా ?"

"ఎక్కడికి జరగమంటావు ? ఇదేం రైలుపెట్టె అనుకున్నావా - సముద్రపొడ్డు అనుకున్నావా-జరగమంటున్నావు"

"జరగటానికి ఏముంది నాయనా, ఇదిగో అరుగంటలాయి ఇలాగే వున్నాము" అన్నది పిల్ల తల్లి దొడ్డిగుమ్మంమీదనుంచి. "ఉన్నంతలో సర్దుకోవాలమ్మా - కాస్త కాలుతియ్యి నాయనా, కాస్త....కాస్త....ఆఁ...."

---

● భర్త ఇంటికిరాగానే భార్య ఏడుపుమొహంతో "చూశారా.చూశారా: మీ చెల్లెలు నన్నెల్లా అవమానించిందో!"

భర్త : "మా చెల్లెలు మెద్రాసులో వుందిగా!"

భార్య: "అవును, ఇవ్వాళ ఉత్తరం రాసింది. చింపి చదివాను."

భర్త: "అందులో అవమాన మేముంది!"

భార్య: "చివర 'వదినా! ఈ వుత్తరం మా అన్నయ్యకి ఇవ్వడం మరిచిపోకు' అనిరాసింది"

"చంపేయవయ్యా మమ్మల్ని చంపేయ్"

"కాస్త నించోటానికి చోటు ఇవ్వవేమయ్యా-పైగా కాలుతొక్కానంటావు"

"వుంటే తీసుకోవయ్యా - నే నిచ్చే దేమిటి ?"

ఇంతలో కొత్తగా వచ్చినాయన కాళ్ళు ఓమూల కిందసీటుమీదే పక్కపరుచుకొని పడుకున్న ఆడమనిషిమీదా, తలదగ్గర కూచున్న మగమనిషిమీదా పడ్డాయి.

"అయ్యా, ఆమెను కాస్త లెమ్మనండి. నలుగురు కూచోవచ్చు—"

"హమ్ కలకత్తే జానా" అన్నాడు అతనుహిందీలో.


"కలకత్తా జాతే మాత్రం పడుకోవాలా ? లెమ్మనండి, పైగా పట్టపగలు—"

"హిందీవాళ్లలెండి. వూరుకోండి. ఇంత సేపాయి మేము భరిస్తున్నాము కామా ?" అని ఒక ప్రయాణీకుడు అన్నాడు.

గాయకుడు పాటఆపి, డబ్బులకోసం కదలబోయి; కదలలేక 'అక్కడినుంచే చెయ్యిచాపి అరవసాగాడు. - ఒకాయనకు పెట్టెలు పెట్టుకోటానికి చోటుదొరక్కపోగా తనసీటుమీదే ఆ పెట్టెలు రెండూపెట్టి, దాని మీదే ఎత్తుగా హనుమంతుడల్లే కూచున్నాడు. అతగాడి పిల్లవాడు, అతని భుజాలమీద నించున్నాడు.

"నాన్నా - నాకు పట్టుకోటానికేంలేదు, అది పట్టుకోనా" అన్నాడు కుర్రాడు.

"అదిపట్టుకోకూడదు బాబూ, అది పట్టుకుంటే రైలాగిపోతుంది. గట్టిగా నా తల




కాయేపట్టుకో. దానిమీద చెయ్యివెయ్యకు. ఏదయినా అయిందంటే జుల్మానా కట్టుకోవాలి."

పైన నిద్దుర పోతున్న వాళ్ళిద్దరిమధ్యా కొంతరగడ ప్రారంభమైంది. కాఫీ పీల్చినాయన కాలు, చుట్టతాగుడాయన చేతికి తగిలిందిట-"చూసుకో చూసుకో" అన్నాడు చుట్టాయన.

"పొరపాటు" అన్నాడు కాఫీ.

"పొరపాటు అంటే యెట్లాగయ్యా - నిన్నొక్కటి చరిచి, పొరపాటు అంటాను, నోర్మూసుకొంటావా ?"

"అటువంటిదేనేంటి, ఇది ?"

"చూసుకోవాలయ్యా - ధీమాగా కాలు విసిర్తే ?"

"నువ్వు చుట్ట యెందుకుతాగుతున్నావు ? బండిలో తాగకూడదు" అన్నాడు కాఫీ.

"చుట్ట తాగకూడదనిది ఈ బండిలో కాదు, బస్సులో"

"తీసి పారెయ్యి - ఇదికూడా అంతే"

"రూలులేదు"

"పోనీ వూరుకోండురూ, వున్నరూళ్ళన్నీ పాటిస్తున్నామా ఏమిటి ?" అన్నది ఓ కంఠం.

సగం కూచున్నవాళ్ళూ, చేతులనే కాళ్ళు చేసుకున్నవాళ్ళూ అందరూ ఆట్లాగే మాట్లాడేసుకుంటున్నారు - పోట్లాడుకుంటున్నారు- రాజకీయాలూ- వ్యాపారాలూ అవీ ఇవీ అన్నీను. ఇంతలో దొడ్డికి ఎదురుగా ఆచివరకూచున్నాయనకు దొడ్డి అవసరం కలిగి నట్టుంది - లేచాడు. అక్కడినుంచి దాటుకుంటూ కొందర్ని తొక్కేస్తూ "ఈ గోనెమూట ఎవరిదండి దార్లోపెట్టారూ" అని విసుక్కుంటూ అర గంట తర్వాత మరుగుదొడ్డి చేరుకున్నాడు. మరుగుదొడ్డి గుమ్మంమీద కూచున్న పిల్ల తల్లి లేవావలసి వచ్చింది, లేవటానికి ఏ మాత్రమూ అవకాశంలేదు. అప్పటికీ- "చంకలో పిల్లాడిని కొంచెం అందుకుంటారూ?" అన్నది భర్తను. ఆయన అమడ దూరాన వున్నాడు "ఎట్లాగే! నువ్వు రాలేవు నేను రాలేను. "అన్నాడు.

"అమ్మా మీరు లేవాలి" అన్నాడు వచ్చినాయన.

"ఆదేబాబూ నా ప్రయత్నం— ఏమండీ...."

"కేకవెయ్యకే - ఎట్లా రమ్మంటావు?" అని విసుక్కున్నాడు భర్త.

"నేనెట్లా లేవనండీ - ఎక్కడా సందులేందే -"

"ఏం పర్వాలేదమ్మా. మీరట్లాగే కూచోండి. నేనుదాటేస్తాను"

అని అక్కడికి వచ్చినాయన, ఆయన భాషలో ఆమెమీదనుంచి "దాటాడు!" ఆమె, పిల్లవాడూ ఏవో కొన్ని ఆర్తనాదాలుచేశారు. గాని, ఆ గొడవలో అవేం నోదిలోకి రాలేదు!

కాలు తొక్కినాయనా, తొక్కబడినాయనా తారస్థాయిలో పడ్డారు. ఊరుకోమని కొందరంటున్నారు. కొందరు మనకెందుకని వూరుకున్నారు....

పైన చుట్టతాగుడాయనకూ, కాఫీ తాగుడాయనకూ వాగ్యుద్ధం బాగానే జరుగుతున్నది....

"బండి చాలా నెమ్మదిగా పోతోందేం?" అన్నాడొకాయన.

"మెయిలుగా" అన్నాడు జోకులద్బాయి.

కాస్సేపటికి బండి ఆగే ప్రయత్నంలో వున్నట్టు మరీ నెమ్మదయిపోయింది. స్టేషను వస్తూన్నది.

అక్కడ దిగవలసినవాళ్ల గుమ్మందగ్గరకు రావడానికి శతవిధాల ప్రయత్నిస్తున్నారు.... అక్కడ ప్లాట్‌ఫారం నిండా వున్న జనం లోపలకు యెక్కేందుకు మార్గాలు ఎట్లాగని, ఆందోళన పడుతూ ఆలోచిస్తున్నారు....

బండి ఆగింది ... 000